# మైకం ఖరీదు

"అత్యంత ఆపదలో ఉన్నాము. నువ్వే దిక్కు. వెంటనే రా" టెలిగ్రాం కాగితంపైన ఉమా శంకరుల దీనవదనాలు కన్పించాయి."

వెంటనే బయలుదేరడానికి సన్నాహాలు ప్రారంభించాను.

"మీరెంత అమాయకులండీ? ఆ పుణ్యదంపతులు ఆపదలో లేనిదెప్పుడట! మీరే వారి లీలలు వర్ణిస్తారు. మళ్ళీ టెలిగ్రామ్ రాగానే హడావుడి పడిపోతారు. ఏమిటో? కాస్త తాపీగా ఆలోచించండి".

సుశీలకి నా స్వభావం బాగా తెల్సు. ఉమా శంకరుల కథ తెల్సు.

ఆమె మాటలు నాకాళ్ళకు బంధాలు వేసేయి. హృదయానికి కళ్ళెం బిగించింది.

ఏవేవో చేదు గుర్తులు... చెదురు మదురు సంఘటనలు...

ఉమా నేను మెడిసన్‌లో క్లాస్‌మేట్స్‌మి.

మాకు సీనియర్ శంకరం.

నేను ఉమను మనసులో ఆరాధించే వాడిని. పెద్ద అందగత్తె అని కాదు. చాలా బ్రిలియంట్ గాల్. ఎంత చాకచక్యంగా, చమత్కారంగా మాట్లాడేదని?

నాకు డబ్బువుంది. ధనాన్ని అర్జించే తెలివితేటలున్నాయి. కానీ ఉమకున్న తెలివితేటలు లేవు. చదువంటే నాకు పరమబోర్.

పోనీ ఉమను పెళ్ళి చేసుకొంటే?

ఆ ఆలోచన మనసులో ఓ రూపాన్ని దిద్దుకొనే సమయానికి -

ఉమ, శంకరులు ప్రేమించేసుకొన్నారు. దగ్గర య్యారు.

శంకరం ఉమకన్నా బ్రిలియంట్. అమాటకొస్తే మెడికల్ కాలేజీలోనే బ్రిలియంట్. పుస్తకాలు తప్ప మరోటి పట్టనంత మంచి విద్యార్థి.

నేను మెడిసిన్‌ని మధ్యలోనే మానేశాను. నన్ను డాక్టరుగా చూడాలన్న మా అమ్మమ్మ చనిపోవటంతో నేను మెడిసిన్‌తో కుస్తీపట్టాల్సిన అవసరం పోయింది.

మెడిసిన్ పూర్తయ్యాక శంకరం, ఉమలు పెళ్ళిచేసుకొన్నారు. ప్రాక్టీసు పెట్టారు.

చిత్రం! వారి మొదటి బేచ్ పేషంట్లలోనేను వొకడినయ్యాను.

ధనం వుంటే రోగాలు కూడా తియ్యగానే ఉంటాయంటారు కొందరు.

కానీ నా ధనం నా రోగాన్ని కుదర్చలేకపోయింది. ఎన్ని ఊళ్ళు తిరిగానో?

ఆఖరికి ఉమ శంకరాల ప్రతిభపై గల విశ్వాసంతో వారి వద్దకు వెళ్ళాను.

నా రోగం తీసేసినట్లు తగ్గిపోయింది. నన్ను ఉమా శంకరులకు మరింత దగ్గర చేసింది.

"మీరు వెంటనే పెళ్ళిచేసుకోవాలి. లేకపోతే రోగం తిరగబెడ్తుంది."

అంతవరకు పెళ్ళిపట్ల విముఖుడుగా వున్న నేను సుశీలను చేసుకొన్నాను.

మా రెండు కుటుంబాల మధ్య రాకపోకలు జాస్తి అయ్యాయి.

సురేశ్ పుట్టేనాటికి ఉమా శంకరుల ప్రాక్టీసు మూడు పువ్వులు ఆరు ఫలాలుగా వుంది. బాగా ఆర్జించారు. స్వంత భవనం కొని క్లినిక్‌ను అక్కడికి మార్చారు. కారు కొన్నారు.

"మన మధ్య మిత్రత్వాన్ని బంధుత్వంగా మార్చుకొందామని నా కోరిక శంకరం. మా ఆవిడను ఆడపిల్లని కనమని కోరుతున్నా. మా ఆవిడ నా కోరిక తీరిస్తే సురేశ్‌ని నా అల్లుడిని చేసుకొంటా. మా ఆవిడ నా కోరికనెరవేర్చకుండా మగవెధవనే కన్నదనుకోండి. అప్పుడు ఉమాదేవి ఆడపిల్లను కనాలి. అప్పుడు మీ కూతుర్ని నా కోడల్ని చేసుకొంటా. అయితే ఒక్క కండిషన్. మీ కొడుకును నా అల్లుడిని చేసుకుంటే నేనిచ్చే కట్నాన్ని మీరు పుచ్చుకోవాలి. మీ కూతుర్ని నా కోడల్ని చేసుకొంటే మీరు నాకు కట్నం యిస్తాననకూడదు."

"ఆదేం? మా పేదరికం పైన జాలా?"

"కాదు ఇద్దరు మేధావులకు పుట్టిన సంతానంపై గల గౌరవం"

సుశీల నా కోరిక తీర్చింది. సురేశ్‌ని మనసులో నా అల్లుడిని చేసుకున్నాను.

సురేశ్ కత్తిలాంటి కుర్రాడు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందంటారు.

అదేమిటో సురేశ్‌తో వోగంట గడిపితే తెలుస్తుంది.

అయిదేళ్లకే అఖండమేధాసంపత్తి వెధవకు. ఆట, మాట, పాట, చదువు యిదీ అదీ అని లేదు. అన్నిట్లోనూ ఫస్టే.

వాడికి నాదిష్టే కొడ్తుందేమోనని భయపడేవాడిని నేను.

అదేమో కాని -

పచ్చగా కళకళలాడుతున్న ఉమా శంకరుల సంసారానికే దిష్టికొట్టింది.

పతనం ఆరంభమయింది.

శంకరం అప్పుడప్పుడూ తనకు కడుపు నొప్పి వస్తుందనేవాడు.

"లోకంలో జనం అందరి నొప్పుల్ని తీర్చే ప్రజ్ఞగలవాడివి. నీ కడుపునొప్పి నీకో పెద్ద సమస్యా". నేను జోక్ చేస్తుండేవాడిని

కానీ శంకరం కడుపు నొప్పి బాధనే సహించలేక అప్‌సెట్ అయిపోయి "అంత పని" చేస్తాడని నేను ఊహించలేదు.

ఏ బలహీన క్షణంలో ఏ డ్రగ్ ఎడిక్ట్ ధర్మాత్ముడు పుణ్యం కట్టుకున్నాడో? శంకరానికి "హెరాయిన్" ఇంజక్షన్‌ని రుచిచూపాంచాడు.

యింకేముంది?

అతడికి ఏవో దివ్యలోకాలలో ప్రయాణం చేసిన అనుభూతి కలిగింది. సర్వబాధలూ మర్చిపోయాడు. ఏదో హాయి, మళ్ళీ మళ్ళీ కావాలని కోరిక పుట్టేహాయి!

అమత్తు రుచి మరిగేక అతను మరొక విషయం గమనించాడు.

ఇంజక్షన్ తీసుకొన్నప్పుడు తనకు సెక్స్ వాంఛ వృద్ధి అవుతోంది.

ఉమకు కూడా వొక్క ఇంజక్షన్ యిస్తే?

అప్పుడు తాము పొందబోయే సెక్స్ సుఖం! ఓహ్!!

ఆ భావనే అతని మత్తుని పెంచింది. మైకాన్ని కలుగజేసింది.

ఆమైకంలో యుక్తా యుక్త విచక్షణతను మర్చిపోయాడతను. ఏవో మాటలు చెప్పి ఉమకు ఆ ఇంజక్షన్ మత్తు రుచి చూపించాడు. యిద్దరూ ఆ మత్తులో దివ్యలోకాలలో విహరించసాగారు.

✡ ✡ ✡

"అంకుల్. అమ్మా. నాన్నా...."

నేను చివ్వున తలెత్తి చూచాను.

సురేశ్ నిలబడి వున్నాడు. చంకలో చిన్నబేగ్.

ఆ మధ్య కొన్ని నెలలు నా బిజినెస్ పనులలో తీరికలేక శంకరం, ఉమల వద్దకు వెళ్ళలేదు.

సురేశ్ నన్ను వెతుక్కుంటూ వచ్చాడా నా దగ్గరికి ?

"రా సురేశ్, నువ్వా? ఎప్పుడొచ్చావ్? ఎలా వచ్చావు?" కుర్చీలోంచి లేచి వెళ్ళి సురేశ్‌ని దగ్గరికి తీసుకొంటూ అన్నాడు.

సురేశ్ నాప్రశ్నలను వినీ విననట్లు వూరుకున్నాడు.

"అమ్మా, నాన్నలు ఎలా వున్నారు? వాళ్ళతో చెప్పే వచ్చావా?"

సురేశ్ చాలాసేపు మౌనంగా వుండిపోయాడు.

ఉన్నట్లుండి నేను అతడు మౌనంగా ఏడుస్తున్నాడని గ్రహించాను. దగ్గరికి తీసుకుని వోదార్చాను.

"అమ్మా నాన్నలతో చెప్పకుండానే వచ్చాను అంకుల్. వాళ్ళుఎలా వున్నారో నువ్వే వచ్చి చూడు. వస్తావుగా అంకుల్?"

వూరు విడిచి వెళ్ళే స్థితిలో లేను నేను అప్పుడు.

అయినా సురేశ్‌కన్నా బిజినెస్ ముఖ్యమా నాకు?

సుశీలను తీసుకొని వెళ్ళాను.

మేము చేరేసరికి సాయంకాలమయింది.

ఆ సమయంలో క్లినిక్, జనంతో బిలబిలలాడుతూ వుండేది.

కాని యిప్పుడు జనమేలేరు అక్కడ

ఉమ నిద్రపోతున్నది - పక్కమీద పడుకుని

అసురసంధ్య వేళలో నిద్ర!

సహజ నిద్రకాదది - మైకపు నిద్ర!

శంకరం యింట్లో లేడు. ఎక్కడి కెళ్ళాడో ఏమో?

ఇంట్లో వస్తువులన్నీ మాయమయ్యాయి. సోఫాలు, బీరువాలు, ఫర్నీచర్ చాలా కొన్నారు వాళ్ళు. ఏమయిందా ఫర్నీచర్?

సురేశ్ నోరు విప్పి ఏమీ చెప్పడు. స్వయంగా చూచి యిక్కడి విషయాలు తెల్సుకోవాలన్న వుద్దేశ్యంతో నన్ను తీసుకొచ్చాడు.

వంటరిగా వంట మనిషిని కదిలించాను.

వంటమనిషి పేరు అన్నపూర్ణ. బ్రతికి చెడ్డమనిషి. భర్త హఠాత్తుగా మరణించడంతో దిక్కుతోచక పిల్లలకోసం వంట మనిషిగా కుదురుకొంది.

"ఏం చెప్పను బాబూ? పచ్చటి చెట్టు, చీడపట్టి నిలువునా ఎండిపోతుంటే చూచే వారికి ఎంత కష్టంగా ఉంటుంది? ఈ సంసారస్థితి కూడా అంతే అనుకోండి. ఎంత పేరుంటే మాత్రం విశ్వాసం పోయాక డాక్టరు దగ్గరికి పేషెంట్లు రారుకదా బాబూ? వైద్యం చేద్దామన్న కోరిక అసలు వుంటే కదావారికి.?

"ఆ మత్తు భూతం ఆవహించాక వాళ్ళిద్దరూ బాగా మారిపోయారు. వాళ్ళిప్పుడు డాక్టర్లు కాదు బాబూ. పేషెంట్లు. ఆదాయం లేదు. ఖర్చు పెరిగింది. మరి యింట్లో వస్తువులకి కాళ్ళు రావా బాబూ? వస్తువులతో పాటు యీ ఇంట్లో మనుషులు కూడా పరుగెత్తి పారిపోతున్నారు. కాంపౌండర్లు, సిస్టర్లు, తోటీలు, ఎప్పుడో పోయారు. తోటమాలి, పనివాళ్ళు పోయారు. నేనొక్కదాన్నే వదిలించుకుపోలేక మిగిలిపోయాను, ఎందుకనుకున్నారు? వారిచ్చే డబ్బుకోసం కాదు. వారు జీతం యివ్వటం మానేసి మూడు నెలలయ్యింది. అడుగో, ఆ సురేశ్‌ని చూచి. నేనూ వెళ్తే వాడి తిండి తిప్పలు చూచేవారు కూడా వుండరు కదా బాబూ?"

నాకు ఆయింటి పరిస్థితి అర్థమయ్యింది.

"జీతం నేను పంపిస్తూంటాను అన్నపూర్ణమ్మగారూ, మీరు యీ యింటిని వదలకండి. యిలాంటి సమయంలోనే మీలాంటి వాళ్ళు ఆదుకోవాలి."

"నిజమే బాబూ, కానీ అవతల వాళ్ళు ఎప్పుడు దయ్యాలుగా మారుతారో తెలీదు కదా? నేను దిక్కులేని ఆడదాన్ని. నా పిల్లల విషయం నేనూ చూసుకోవాలి కదా? నాకిక్కడేమన్నా అవుతే వాళ్ళు దిక్కులేని అనాధలయిపోతారు కదా?"

"అంటే ..."?

"ఏమిటో నేను వివరించలేను బాబూ? యీ రాత్రికి మీరు వుంటారుగా? మీకేతెలుస్తుంది లెండి. రాక్షసగణం మధ్య జీవించడం కష్టం బాబూ'

✡ ✡ ✡

రాత్రి బాగా పొద్దుపోయింది. నాకు నిద్రపట్టలేదు.

యింటి ముందు కారు ఆగింది. నేను కిటికీగుండా తొంగి చూచాను.

శంకరం వెంట మరో వ్యక్తి కారు దిగేడు. యిద్దరూ లోపలికి వచ్చారు.

ఆ వ్యక్తిని శంకరం తన బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్ళాడు.

"అదుగో, ఆమె. ఆమే నా భార్య. బాగుంది కదా?"

"ఊ ...."

"ప్రస్తుతానికి వొక్క వయల్ యివ్వండిచాలు. యీ రాత్రికి మీరీ గదిలో వుండండి. నేను ఇంజక్షన్ తీసుకుని పక్క గదిలో పడుకుంటాను. రేప్రొద్దున ..."

వినలేకపోయాను. శంకరమేనా ఆ మాటలనంటోంది ?"

ఎంత పతనం ? ఇంతలో ఎంత పతనం?

శంకరం నన్ను చూచి కాస్తంత కంగారుపడ్డాడు.

"ఇప్పుడే వస్తాను" అంటూ ఆ వ్యక్తిని తీసుకుని వెళ్ళిపోయాడు.

ఆ ఇంజక్షన్ ద్రవంలో అంత దుర్మార్గం దాగివుందా?

రాక్షసత్వం నిండి వుందా ఆ మత్తులో?

వ్యసనమే అసలు పెద్ద నిషా.

జూదపు నిషాలోనే కదా అలనాడు ధర్మరాజులాంటి వున్నతుడు, పెళ్ళాన్ని, సోదరులని కూడా ఫణంగా పెట్టేడు.!

ఆ రాత్రి శంకరం మరిరాలేదు.

తెల్లవారేక ఉమ లేచింది. కానీ పూర్వంలాగా మాతో సర్దాగా గడపలేదు. ఏదో పోగొట్టుకొన్నదానిలా వుంది.

ఆ మధ్యాహ్నం సుశీల ఎక్కడికో వెళ్ళింది. నేను మా గదిలో వొంటరిగా వున్నాను.

తలుపు తట్టిన శబ్దమైంది.

లోపలికి వస్తూనేతలుపు గడియబిగించింది ఉమ.

"నా పనికి ఆశ్చర్యపోకండి. మిమ్మల్ని ఒక కోరిక కోరడానికి వచ్చాను. మీరు నా కోరికను కాదనకూడదు.

"కోరికా, ఏమిటి?"

"చెప్తాను. కానీ చెప్పేక కాదనకూడదు. మీరు తీర్చగల కోరికే. కావాలంటే నా నుంచి ఏమైనా కోరండి. అంతే కాని నా కోరికను మాత్రం కాదనకూడదు. ఏం?"

నాకు వుత్సుకత పెరిగింది.

"నాకు డబ్బు కావాలి. శంకరం డబ్బంతా తనొక్కడి కోసం తగలేస్తున్నాడు. అది చాలక నన్ను కూడా కుదవపెట్టడానికి, బాడుగకు యివ్వడానికి సిద్ధపడ్తున్నాడు. ఎంత అన్యాయమో చూడండి?'

"కానీ అసలిదంతా ఏమిటి? మీరిలా ఎందుకయ్యారు" అంటూ నీతులు చెప్పబోయాను.

"నీతులు వద్దు. నాకు యిప్పుడు అర్జంటుగా డబ్బుకావాలి".

"ఎంత?"

ఆమె అడిగిన అంకెవిని ఆశ్చర్యపోయాను.

"అంత డబ్బు ఏం చేస్తారు?"

"అది చెప్పడం అవసరమా? మీ దగ్గర డబ్బుంది. నాకు అవసరం వుంది. డబ్బు యిచ్చినందుకు మీకు నా నుంచి ఏదన్నా కావల్సివుంటే సందేహించకుండా అడగండి. యిచ్చేస్తాను. ఏదైనాసరే"

"ఏదైనా యిచ్చేస్తావా?"

"ఆ, తొందరగా అడిగి తీసుకోండి. మీరు నన్ను ప్రేమించారని నాకు తెల్సు"

నేనేమడుగుతాననుకొంటున్నది? కొంపతీసి ..........

"సందేహించకండి. శంకర్ నన్ను ఎప్పుడో నాకు తెలియకుండానే కుదవ పెట్టేస్తాడు. వీలయితే అమ్మేస్తాడు. అంతకుముందే నన్ను నేను అమ్ముకోవటం మంచిది కదా? నేను మీ కోరిక తీర్చడానికి సిద్ధంగా వున్నాను." ఆమె పైట తొలగించి ముందుకు వచ్చింది.

నేను అసహ్యంగా ఆమెను వెనక్కి నెట్టాను.

"నేను నీ నుంచి కోరదల్చింది అది కాదు ఉమా. నువ్వు ఆ మత్తులో నుంచి బయటకురా. వాస్తవాన్ని గుర్తించు. నీ సంసారాన్ని తీర్చిదిద్దుకో. అందుకు ఫలంగా నువ్వుకోరినదానికి పదింతలు ధనాన్ని యిస్తాను.

"ఛీ, నువ్వు మగాడివి కాదు. నా ఫ్రెండ్‌వి అంతకన్నాకావు. అవసరంలో ఆదుకోలేని నీ మొహాన్ని నా కెప్పుడూ మళ్ళీ చూపకు. మా యింటికి రాకు."

ఆమె కోపంగా వెళ్ళిపోయింది. ఎటు వెళ్ళిందో ఏమో?

ఆ రాత్రికి ఇంజక్షన్ చేసుకోబోతున్న శంకరంను ఆపేప్రయత్నం చేసి శృంగభంగం పొందేను.

"అంకుల్, అమ్మా, నాన్నా ఎలాగున్నారని అడిగేరు. చూచారుకదా? స్కూల్లో తలెత్తుకు తిరగలేకపోతున్నాను అంకుల్. అమ్మా నాన్నలను గురించి అందరూ ఎంతచెడుగా చెప్పుకొంటూంటారో తెల్సా? విన్నప్పుడు నాకు చనిపోవాలనిపిస్తుంది. అమ్మ నాన్నలను చంపేయాలనిపిస్తుంది. నన్నేం చేయమంటావో చెప్పు అంకుల్"

"ఆలోచించి చెప్తాను సురేశ్. నువ్వు మాత్రం తొందరపడకు".

ఆ మర్నాడు నేను వచ్చేసాను.

ఆ తర్వాత సురేశ్‌ని ఏదన్నా పబ్లిక్ స్కూల్‌లో చేరుద్దామన్న నా ప్రయత్నాలని శంకరం, ఉమలు కల్సికట్టుగా విఫలంచేసేరు.

"ఏం? మేము అక్కర్లేదు కానీ మా కొడుకుకావాలా? కట్నం లేకుండా అల్లుడిని కొట్టుకుపోయే ఎత్తు మాకు తెలియదా?"

ఆ యింటికి వెళ్ళిన ప్రతిసారీ ఆ భార్యాభర్తల చేత అవమానం పొందేను.

ఆ తర్వాత నేను వాళ్ళ వద్దకెళ్ళటం క్రమంగా తగ్గించాను.

యిప్పుడు ఈ టెలిగ్రాం.

వెళ్ళకుండా ఎలా వుండటం ?

వాళ్ళు ఎలాంటి ఆపదలో వున్నారో?

సురేశ్ ఎలా వున్నాడో ?

మత్తులో వుండి, మైకంలో పడి వారు నన్ను అవమానించిన మాట నిజమే. కానీ మత్తుమహిమ అది. వాళ్ళ తప్పు ఎలాగవుతుంది? వాళ్ళని బానిసల్ని చేసుకొని ఆడిస్తున్న వ్యసనం తప్పు అది.

నేను కారులో వారి వద్దకు బయలుదేరాను.

✡ ✡ ✡

ఇల్లు శ్మశానవాటికలా వుంది.

శంకరం, ఉమ - సజీవ శవాలలాగున్నారు.

వారు నన్ను చూశారు. కానీ ఆ చూపులో జీవం లేదు. సుఖం,.. దుఃఖం, ఆనందం అవమానం, వీటికి అతీతస్థితిలో వున్నారా?

"ఏం జరిగింది శంకరం. ఈ టెలిగ్రాం ఏమిటి?"

సమాధానం లేదు.

"నువ్వన్నా చెప్పు ఉమా, మీ కొచ్చిన అపద ఏమిటి?"

సురేశ్ కోసం వెతుకుతుంటే వంటమనిషి అన్నపూర్ణమ్మగారు కన్పించింది

"ఆ టెలిగ్రా యిచ్చింది వాళ్ళు కాదు బాబూ, నేను".

"మీరా?"

"కొడుకును చంపుకున్నామన్న షాక్‌లో వున్నారు వారిద్దరూ..."

ఏమిటి? సురేశ్ చనిపోయాడా? ఆణిముత్యంలాంటి భావిభారత పౌరుడు... తల్లిదండ్రులు వాడిని చంపుకొన్నారా?

అన్నపూర్ణమ్మగారి ద్వారా జరిగింది తెల్సుకొన్నాను.

సురేశ్ అసలే సెన్సిటివ్ మనిషి. తల్లిదండ్రుల ప్రవర్తనను గురించి తోటి పిల్లలు, వాళ్ళ తల్లిదండ్రులు... యిరుగు పొరుగు వారు అనుకొంటున్న మాటల్ని విని భరించలేకపోయాడు.

తల్లిదండ్రులను మార్చడానికి ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలుడయ్యాడు.

అతని ఆరోగ్యం శారీరకంగా మానసికంగా కూడా దెబ్బతిన్నది.

అంతక్రితమే శంకరం, అన్నపూర్ణమ్మగారి మీద అత్యాచారం జరపబోయాడు. ఆమె గత్యంతరం లేక ఆ యిల్లు వదిలేసి వెళ్ళిపోయింది. అయినా సురేశ్ కోసం అప్పుడప్పుడూ వచ్చిపోతుండేది.

తిన్నరోజు తినటం, లేకపోతే పస్తు... సురేశ్ ఆరోగ్యం మరింత దెబ్బతిన్నది.

ఆరోజు -

అతను జ్వరంతో బాధపడ్తున్నాడు. గుండెల్లో నొప్పి...భరించలేకపోయాడు.

తల్లి..తండ్రి..యిద్దరూ డాక్టర్లు.

ఎలాంటి జ్వరాలనైనా తగ్గించగల ప్రజ్ఞాశాలురు అన్న పేరువుంది.

ఇలాంటి బాధలు ఎందరికి కుదిర్చారో?

అతను వోపికచేసుకొని లేచి తండ్రి గదిలోకి వెళ్ళాడు.

శంకరం అప్పుడే వేట ముగించుకుని వచ్చాడు.

పెద్దపులిని చంపివచ్చినంత ఆనందంగా వున్నాడు. అతనికి కావాల్సిన ఇంజక్షన్ వయల్స్ దొరకటమే అందుక్కారణం.

"డేడి, గుండెగొప్పి..."

శంకరం ఇంజక్షన్ పొడుచుకోవడానికి సన్నాహం చేస్తున్నాడు.

"అన్నిబాధలకు యిదే దివ్యౌషధం. నీకూ వొక ఇంజక్షన్ ఇస్తాను రా" వయల్‌లోనుంచి సిరంజ్‌లోకి మందు ఎక్కిస్తూ అన్నాడు శంకరం.

సురేశ్‌కి భయంవేసింది. తండ్రిపైన చెప్పలేని అసహ్యం వేసింది. తన బ్రతుకుపైనే అసహ్యం వేసింది.

ఇంతలో అక్కడికి ఉమ వచ్చింది. భర్తచేతిలో సిరెంజ్ చూచింది.

"శంకర్, ఆ ఇంజక్షన్ నాకివ్వు. రెండురోజులుగా లేక పిచ్చెక్కి చస్తున్నాను. ప్లీజ్ శంకర్.'

కొడుకు ఎదుట ఆ తర్వాత భార్యాభర్తలు ఇంజక్షన్ కోసం పోరాడుకొన్నతీరు వర్ణనాతీతం.

రెండుకోడిపుంజులు... మేకపోతులు...దున్నపోతులు...కుక్కలు...పులులు... పోట్లాడుకున్నట్లు పోట్లాడుకుంటున్నారు.

చివరికి'ఉమ' జయించింది. ఇంజక్షన్‌ని తనూ పొడిచేసుకొంది.

ఆ తర్వాత కొంచెంసేపటికి ఇద్దరూ మత్తులో మంచంపై పడిపందుల్లా పొర్లాడసాగారు. ఇంజక్షన్ పైన ఇంజక్షన్... మత్తు... మరింత మత్తు...

ఆ దృశ్యాన్ని చూసిన సురేశ్ గుండె పగిలింది, బాధపెరిగింది.

అక్కడికక్కడే కుప్పగా కూలిపోయాడు.

"అమ్మా.... నాన్నా...." బాధతో గిలగిలలాడిపోయాడు.

కానీ ఆ అమ్మా నాన్నలు అల్లంతదూరంలో మత్తులో మునిగి స్వర్గ సుఖాలను అనుభవిస్తున్నామన్న భ్రాంతిలో వున్నారు.

ఆ రాత్రంతా అలాగే గడిచింది.

తెల్లవారేక అన్నపూర్ణమ్మగారు వచ్చింది.

జరిగినదంతా ఆమెకు చెప్పేడు సురేశ్

కళ్ళు మూసేడు.

అన్నపూర్ణమ్మగారు సురేశ్ కోసం కన్నీళ్ళు కార్చింది. అయినా ఆ స్థితిలో ఆమె అంతకన్నా ఏం చేయగలదు?

శంకరం, ఉమలకు మైకం దిగింది.

"బాబూ, సురేశ్ చనిపోయాడు"

సురేశ్ చనిపోయాడా? సురేశ్... అయ్యో...?

అదే సమయం అనుకుని జరిగినదంతా బాధాతప్తహృదయంతో చెప్పింది. శంకరం, ఉమలకు షాక్ కొట్టినట్లయింది.

శవాలయ్యారు.

అది చూచి భయంతో అన్నపూర్ణమ్మగారు నాకు టెలిగ్రామ్ యిచ్చారు.

✡ ✡ ✡

ఎంత ప్రయత్నించీ కన్నీళ్ళ ప్రవాహానికి ఆనకట్టవేయటం నాకు సాధ్యం కాకపోయింది.

"చనిపోయేముందు యీ చిన్న కాగితం మీద సురేశ్ ఏదో రాసాడు." అంటూ ఆమె నాకో కాగితాన్ని ఇచ్చింది.

"టు హూమ్ సో ఎవర్ ఇట్‌కన్‌సర్న్" ఇంగ్లీషులో వుందా చీటీ మీదరాత. దాని సారాంశం యిది.

"అట్టహాసాలు ఆడంబరాల మధ్య జన్మించాను నేను. నేను పుట్టినందుకు ఆనాడు పండుగ చేసుకొన్నారుట. కానీ ఇప్పుడు మరణించే ముందు మంచి నీటిచుక్క ఇచ్చేవారు లేక గింజుకులాడేను. నాబాధను కనీసం ఓదార్చేవారు లేక గిలగిలలాడిపోయాను. నేను జన్మించినపుడు సంతోషించి విందులు చేసిన నా తల్లిదండ్రులు నాకు కొన్ని అడుగుల దూరంలో వున్నారు. కానీ నా దిక్కులేని చావుకు కన్నీటి చుక్క కార్చే స్థితిలో కూడా లేరువారు.

యిలాంటి దుస్థితి యీ దేశంలో మరే బాలుడుకి, బాలికకు కలగరాదని నా చివరికోరిక.

మమతా మానవత్వాల నుంచి మనిషిని దూరంచేసే మత్తులను మైకాలను అంతం చెయ్యండి. పిల్లలకు సహజమైన టానిక్ - తల్లిదండ్రుల ప్రేమ, అనురాగాలు. వాటిని హరించిపారేసే అన్నిమత్తలను వురితియ్యండి.

పిల్లల్ని కాపాడుకోండి. దేశాన్ని రక్షించుకోండి.

సురేశ్ -"

శబ్దమై అటూ చూచాను.

నేల మీద గాజు పెంకులు. సిరెంజ్‌వో, వయల్స్‌వో?

శంకర్, ఉమలు వచ్చి నా కాళ్ళ మీద పడ్డారు.

"కన్న కొడుకును చంపుకొన్న హంతకులం మేము. పచ్చటి సంసారానికి వురివేసుకున్న మూర్ఖులం."

తమని తామే తిట్టుకొంటున్నారు వారు. కన్నీరు కారుస్తున్నారు.

వారి మత్తు శాశ్వతంగా దిగిపోయిందని తెల్సునాకు. వాళ్ళు మళ్ళీ మామూలు మనుష్యులు కావటం కష్టం కాదు.

కానీ వారి మత్తు ఖరీదెంత? మైకం వెల ఎంత?

సురేశ్ జీవితం! ఆ కుటుంబానికి, నాకు, దేశానికీ ఎంత నష్టం?

నేను ఆలోచనలో పడ్డాను?

ఇలాంటి కథలు జరగకుండా అరికట్టడం ఎలా?

స్వాతి మాసపత్రిక - మార్చి 1986